జీఎస్టీ వసూళ్లు 1.73 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, జూన్ 1: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన జీఎస్టీ వసూళ్లు తగ్గుముఖం పట్టాయి. మే నెలకుగాను రూ.1.73 లక్షల కోట్ల మేర వసూలయ్యాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో వసూలైనదాంతో పోలిస్తే 10 శాతం పెరిగినప్పటికీ, ఏప్రిల్‌లో రూ.2.10 లక్షల కోట్లతో పోలిస్తే తగ్గాయి. వీటిలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.32,409 కోట్లు, స్టేట్ జీఎస్టీ కింద రూ.40,265 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.87,781 కోట్లు, సెస్ రూపంలో మరో రూ.12,284 కోట్లు సమకూరాయి. గత రెండు నెలల్లో రూ.3.83 లక్షల కోట్ల జీఎస్టీ వసూలయ్యాయి.

తెలంగాణలో 4,986 కోట్లు

తెలంగాణలో జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. గత నెలకుగాను రూ.4,986 కోట్లు వసూలైనట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.4,507 కోట్లతో పోలిస్తే 11 శాతం అధికమని పేర్కొంది. అలాగే పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోనూ 15 శాతం చొప్పున పెరిగాయి. 2023 ఏడాది మే నెలలో రూ.3,374 కోట్ల జీఎస్టీ వసూలవగా, ఈసారి రూ.3,890 కోట్లకు చేరుకున్నాయి.

సింగరేణి సీఎండీకి ఐఐఐఈ ఎక్సలెన్స్ అవార్డు

కంపెనీల విభాగంలో సంస్థకు మరో పురస్కారం

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్(ఐఐఐఈ) సంస్థ అందించే ఫెర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ అవార్డు-2024కు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం ఎంపికయ్యారు. ఉత్తరాఖండ్ ముస్సోరిలో శుక్రవారం జరిగిన 24వ జాతీయ స్థాయి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల సమావేశంలో బలరాం తరపున సంస్థ ఆపరేషన్స్ అండ్ పర్సనల్ డైరెక్టర్ ఎన్ వీకే శ్రీనివాస్ ఈ అవార్డును స్వీకరించారు. ఆయన సారథ్యంలో 2023 -24లో సింగరేణి 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, రవాణాతోపాటు రూ.35,700 కోట్ల టర్నోవర్‌ను సాధించింది. కంపెనీల విభాగంలో అద్భుతమైన పనితీరును కనబరిచిన సింగరేణి సంస్థకు సైతం ఫెర్ఫార్మెన్స్ ఎక్స్‌లెన్సీ అవార్డును నిర్వాహకులు బహూకరించారు. సంస్థ జీఎం టీ సురేశ్‌బాబు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ భాస్కర్, డీజీఎం సీహెచ్ సీతారాంబాబు, ఏవీవీ ప్రసాద్‌రావు అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా సహకార బ్యాంకులు

- 9 ఏండ్లలో గణనీయంగా పెరిగిన వ్యాపారం
- రూ.13,156 కోట్ల నుంచి రూ.43,264 కోట్లకు వృద్ధి
- 3 రెట్లు పెరిగిన వినియోగదారులు, డిపాజిట్లు
- పలు జాతీయ అవార్డులు కైవసం చేసుకున్న టెస్కాబ్

విప్లవాత్మక సంస్కరణలు

తెలంగాణ సహకార బ్యాంకింగ్ వ్యవస్థలో కొండూరి రవీందర్‌రావు విప్లవాత్మక సంస్కరణలను ప్రారంభించారు. ప్రాథమిక సహకార సంఘాలు మొదలుకొని టెస్కాబ్ వరకు అన్ని బ్యాంకుల్లో కార్యకలాపాలను కంప్యూటీకరించడంతోపాటు సైబర్ దాడులను ప్రతిఘటించేందుకు ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఖాతాదారులకు తొలిసారి రూపే ప్లాటినం కార్డులను జారీ చేయడంతోపాటు మొబైల్ ఏటీఎం సేవలను అందించారు. ఈ విధానాలను అనుసరించేందుకు కేంద్రంతోపాటు పలు రాష్ట్రాల ప్రభుత్వాలు ముందుకొచ్చాయి. టెస్కాబ్‌ను సందర్శించి ఆ విధానాలపై అధ్యయనం చేశాయి.



కొండూరి రవీందర్‌రావు

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): స్వరాష్ట్రం ఏర్పాటుకు ముందు తెలంగాణలో ఉన్నాయా అంటే ఉన్నాయన్నట్టుగా ఉన్న సహకార బ్యాంకులు ఇప్పుడు యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచే స్థాయికి ఎదిగాయి. ఇతర దేశాలు సైతం తెలంగాణ సహకార బ్యాంకుల విధానాలను అనుసరిస్తున్నాయి. గత తొమ్మిదేండ్లలో ఈ బ్యాంకులు గణనీయ వృద్ధిని సాధించాయి. నాటి సీఎం కేసీఆర్ మార్గనిర్దేశం, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు నాయకత్వంలో అనతి కాలంలోనే అగ్రగామిగా నిలిచాయి. పలు సంస్కరణలతో రైతులకు అద్భుత సేవలను అందిస్తూ సహకార బ్యాంకులపై వినియోగదారులకు నమ్మకాన్ని కలిగించాయి. దీంతో రాష్ట్ర సహకార బ్యాంకింగ్ వ్యవస్థను అనేక అవార్డులు వరించాయి.

9 ఏండ్లలో 30 వేల కోట్లకుపైగా వృద్ధి

తెలంగాణలో 2014 నాటికి రూ.13,156 కోట్లుగా ఉన్న సహకార బ్యాంకుల వ్యాపార పరిమాణం 2023లో రూ.43,264 కోట్లకు చేరింది. అంటే.. గత తొమ్మిదేండ్లలోనే రూ.30,108 కోట్ల బిజినెస్ పెరిగింది. ఇందులో టెస్కాబ్ వ్యాపారం రూ.6,307 కోట్ల నుంచి రూ.20,940 కోట్లకు, డీసీసీబీల వ్యాపారం రూ.6,849 కోట్ల నుంచి రూ.22,324 కోట్లకు వృద్ధి చెందింది. 2014 నాటికి తెలంగాణలో 292గా ఉన్న సహకార బ్యాంకుల శాఖల సంఖ్య గత సంవత్సరం చివరి నాటికి 437కు, వినియోగదారుల సంఖ్య 11.01 లక్షల నుంచి 32.94 లక్షలకు పెరిగింది. దీంతో డిపాజిట్లు రూ.5,257 కోట్ల నుంచి రూ.15,581 కోట్లకు చేరాయి. అంటే.. గత తొమ్మిదేండ్లలో రూ.10,324 కోట్ల డిపాజిట్లు పెరిగాయి.

ఉద్యోగులకు వరంలా

ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగులకు ఏ మాత్రం తీసిపోని విధంగా రాష్ట్రంలోని సహకార బ్యాంకు ఉద్యోగులకు నాటి కేసీఆర్ ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పించింది. ఎలాంటి అవకతవకలు, ఆరోపణలు లేకుండా 7,165 ఉద్యోగాలను భర్తీ చేసింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రత్యేక హెచ్ఆర్ పాలసీని ప్రవేశపెట్టింది. క్రమం తప్పకుండా ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి ఐబీపీఎస్ ద్వారా పారదర్శకంగా పదోన్నతులు కల్పించింది.

సహకార బ్యాంకింగ్‌పై కొండూరి ముద్ర

తెలంగాణలోని సహకార బ్యాంకులు దేశంలోనే ప్రత్యేక గుర్తింపును పొందడం వెనుక కొండూరి రవీందర్‌రావు కృషి ఎనలేనిదని ఉద్యోగులు ప్రశంసిస్తున్నారు. టెస్కాబ్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత వాటి రూపురేఖలను మార్చేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగారు. 2005 నుంచి మూడు పర్యాయాలు గంభీరావుపేట ప్రాథమిక సహకార సంఘానికి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన.. ఆ తర్వాత కరీంనగర్ జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షునిగా 19 ఏండ్లు పనిచేశారు. 2015లో టెస్కాబ్ చైర్మన్‌గా ఎన్నికయ్యాక నాటి సీఎం కేసీఆర్ సహకారంతో రాష్ట్రంలోని సహకార బ్యాంకుల బలోపేతానికి చర్యలు చేపట్టారు. అందుకోసం అనేక దేశాల్లో పర్యటించి అక్కడ అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి, ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వచ్చారు. తద్వారా సహకార బ్యాంకింగ్ రంగంలో తనదైన ముద్ర వేశారు.

టెస్కాబ్, డీసీసీబీల ప్రగతి వివరాలు

అంశం	2014	2023
శాఖలు	292	437
వినియోగదారులు	11.01 లక్షలు	32.94 లక్షలు
మూలధనం	రూ.572 కోట్లు	రూ.1,382 కోట్లు
డిపాజిట్లు	రూ.5,257 కోట్లు	రూ.15,581 కోట్లు
రుణాలు, అడ్వాన్సులు	రూ.7,899 కోట్లు	రూ.27,682 కోట్లు
వ్యాపారం	రూ.13,156 కోట్లు	రూ.43,264 కోట్లు

అవార్డులే అవార్డులు

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో తెలంగాణ సహకార బ్యాంకింగ్ వ్యవస్థ తనదైన ముద్రను వేసింది. దీంతో పలు జాతీయ స్థాయి అవార్డులు తెలంగాణను వరించాయి. 2020-21లో టెస్కాబ్‌ను దేశంలోనే ఉత్తమ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌గా నాబార్డు ప్రకటించింది. ఆ తర్వాత 2016-17, 2017-18లో వరుసగా రెండు సార్లు నాఫ్కాబ్ ఓవరాల్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును కైవసం చేసుకున్న టెస్కాబ్.. 2020-21లో మూడో స్థానంలో, 2021-22లో రెండో స్థానంలో నిలిచింది. 2018-19లో బెస్ట్ హెచ్ఆర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్సలెన్స్ అవార్డును, 2023లో 'బ్యాంకో బ్లూ రిబ్బన్-2022' అవార్డును గెలుచుకున్నది.

అమ్మే చంపాలని చూసింది

- గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఈడీ సమీర్ మోదీ
- కుటుంబ వ్యాపారాల్లో తారాస్థాయికి చేరిన తగాదాలు

సమీర్ మోదీ, బినా మోదీ

న్యూఢిల్లీ, జూన్ 1: కంపెనీ బోర్డు సమావేశం జరుగుతుండగా, తన తల్లి బినా మోదీ తనపై భౌతిక దాడి చేయించారని, చంపేయాలని చూశారని ప్రముఖ సిగరెట్ల తయారీ సంస్థ గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా (జీపీఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సమీర్ మోదీ ఆరోపించారు. ఈ మేరకు ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రూ.11,000 కోట్ల కేకే మోదీ వ్యాపార సామ్రాజ్యంలో కుటుంబ వైరం తారాస్థాయికి చేరినట్లైంది. మే 30న నిర్వహించిన జీపీఐ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశానికి వస్తున్న తనను బినా మోదీ వ్యక్తిగత భద్రతా అధికారి అడ్డుకున్నారని, ఆగకపోతే తీవ్రంగా దాడి చేశారని, దీంతో తన చూపుడు వేలు విరిగిందని మూడు పేజీల ఫిర్యాదులో పేర్కొన్నారు. చివరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోయినట్టు తెలిపారు. దాడి దృశ్యాలు సీసీటీవీలో రికార్డైనట్టు పోలీసులకు తెలిపారు. కాగా, కేకే మోదీ-బినా మోదీలకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడే సమీర్ మోదీ. మరొకరు తీవ్ర ఆర్థిక నేరారోపణల్ని ఎదుర్కొంటూ దేశం విడిచి పారిపోయిన లలిత్ మోదీ. కుటుంబ ఆస్తులపై వీరంతా సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే.

గతంలోనూ..

దేశీయ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన అనేక కుటుంబాల్లో ఆస్తుల తగాదాలు జరిగాయి. వాటిలో బజాజ్, బాంబే డైయింగ్, ఫోర్టిస్, ర్యాన్‌బాక్సీ, రేమాండ్స్, రిలయన్స్, కిర్లోస్కర్, అపోలో టైర్స్, అమర్‌చంద్ మంగళ్‌దాస్ కంపెనీల వారసత్వాలున్నాయి.

మోచిప్‌కు 509 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, జూన్ 1: హైదరాబాద్‌కు చెందిన సెమికండక్టర్ల సాఫ్ట్‌వేర్-సిస్టమ్ డిజైన్ సేవల సంస్థ మోచిప్ టెక్నాలజీ లిమిటెడ్‌కు రూ.509.37 కోట్ల విలువైన కాంట్రాక్ట్ లభించింది. ఈ కాంట్రాక్ట్ సీడాక్ నుంచి వచ్చినట్లు కంపెనీ పేర్కొంది. ప్రస్తుతం సంస్థకు సిలికాన్ వ్యాలీ-అమెరికా, హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, పుణెలలో 1,300 మంది ఇంజినీర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఆర్డర్‌లో భాగంగా వచ్చే మూడేండ్లకాలంలో 5 నానో మీటర్ టెక్నాలజీతో హెచ్‌పీసీ ఎస్‌వోసీ ఆధారిత ఉత్పత్తులను డిజైన్ చేయడంతోపాటు అభివృద్ధి చేసి సరఫరా చేయనున్నది.

ప్యాసింజర్ వాహనాల్లో నిస్తేజం

- ఎన్నికలతో గత నెలలో వృద్ధి అంతంతే

న్యూఢిల్లీ, జూన్ 1: గత కొన్ని నెలలుగా టాప్‌గేర్‌లో దూసుకుపోయిన ప్యాసింజర్ వాహన విక్రయాలు స్వల్ప వృద్ధికి పరిమితమయ్యాయి. దేశవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతుండటంతోపాటు హై బేస్ ఆధారంగా అమ్మకాలు సింగిల్ డిజిట్‌కు పరిమితమయ్యాయి. మొత్తంమీద గత నెలలో 3,50,257 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 3,35,436తో పోలిస్తే కేవలం నాలుగు శాతం మాత్రమే పెరిగాయి. వీటిలో కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ 1,44,002 యూనిట్లు మాత్రమే విక్రయించింది. ఎంట్రీ లెవల్, కాంప్యాక్ట్ సెగ్మెంట్ కార్ల విక్రయాలు తగ్గుముఖం పట్టగా..యుటిలిటీ వాహనాలు మాత్రం పెరిగాయి. ఈ ఏడాది వాహన అమ్మకాలు పుంజుకునే అవకాశాలు కనిపించడం లేదు..అధిక బేస్ ఎఫెక్ట్, ఎన్నికలు, ఉష్ణోగ్రతలు పెరగడంతో గత నెలలో తగ్గుముఖం పట్టాయని మారుతీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ పార్థో బెనర్జీ తెలిపారు.

మారుతి కార్ల ధరలు తగ్గింపు

మారుతి సుజుకీ ఎంపిక చేసిన మాడళ్ల ధరలను తగ్గించింది. ఆటోగేర్ షిఫ్ట్‌తో తయారైన ఆల్టో కే10, ఎస్-ప్రెస్సో, సెలేరియో, వ్యాగన్-ఆర్, స్విఫ్ట్, డిజైర్, బాలెనో, ఫ్రాంక్స్, ఇగ్నిస్ మాడళ్ల ధరలను రూ.5 వేల వరకు తగ్గించింది. ఈ ధరలు శనివారం నుంచి అమలులోకి వచ్చాయి.

మే నెలలో వాహన అమ్మకాల తీరు

సంస్థ	2024	2023	వృద్ధి(%లో)
మారుతి	1,74,551	1,78,083	-2
హ్యుందాయ్	63,551	59,601	7
టాటా మోటర్స్	76,766	74,973	2
టయోటా కిర్లోస్కర్	25,273	23,959	24
కియా ఇండియా	19,500	18,766	4
ఎంజీ మోటర్	4,769	5,006	-5
మహీంద్రా	71,682	61,415	17
రాయల్ ఎన్‌ఫీల్డ్	71,010	77,461	-8

ఏడాది చివర్లో వీరమల్లు సందడి

హిస్టరీలో ఉన్న పాత్రలను తీసుకొని, వాటి చుట్టూ అల్లిన కల్పిత జానపద కథ 'హరిహరవీరమల్లు'. ప్రకటన వచ్చిన నాటినుంచి పవన్‌కల్యాణ్ అభిమానులే కాక, యావత్ సినీప్రియులంతా ఆ సినిమాకోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పవన్ కల్యాణ్ ఇందులో రాబిన్‌హుడ్ తరహా పాత్ర చేస్తుండటం విశేషం. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఈ సినిమా మూడొంతులు షూటింగ్ పూర్తిచేసుకోగా, మిగతా షూటింగ్, పోస్ట్‌ప్రొడక్షన్ పనులను క్రిష్ పర్యవేక్షణలో దర్శకుడు జ్యోతికృష్ణ పూర్తి చేస్తున్నారు. ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీ కోసం ప్రత్యేకంగా 17వ శతాబ్దం నాటి చార్మినార్, ఎర్రకోట, మచిలీపట్నం ఓడరేవు వంటి భారీ సెట్లను అంతర్జాతీయ నిర్మాణ విలువలతో రాజీ లేకుండా నిర్మించారు. తాజా అప్డేట్ ఏంటంటే.. ఈ సినిమాకు దర్శకుడు మారినట్టే, ఇప్పుడు డీవోపీ కూడా మారాడు. ఇప్పటివరకూ జ్ఞానశేఖర్ వి.ఎస్ ఛాయాగ్రహణం అందించగా, ఆయన స్థానంగా ఇప్పుడు మనోజ్ పరమహంస వచ్చి చేరారు. మిగతా షూటింగ్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ లొకేషన్లు వెతికే పనిలో పడింది. మరోవైపు ఇప్పటివరకూ జరిగిన షూటింగ్‌కు సంబంధిచిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతున్నది. ఈ ఏడాది చివరికల్లా 'హరిహర వీరమల్లు పార్ట్1' 'స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'ను విడుదల చేయడానికి టీమ్ సిద్ధమయింది. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీడియోల్, సునీల్, నోరా ఫతేహి కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాత: ఎ.దయాకర్‌రావు, సమర్పణ: ఏ.ఎం.రత్నం.

చిత్రం

ఆ యువ దర్శకుడెవరు?

కెరీర్ పరంగా ఎక్కువ గ్యాపే తీసుకుంది సమంత. ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కోసం ఈ విలువైన సమయాన్నంతా కేటాయించింది. ఎట్టకేలకు మళ్లీ కెమెరా ముందుకు రాబోతున్నది. అది కూడా తన సొంత నిర్మాణ సంస్థ ద్వారా. ఇటీవలే 'మా బంగారుతల్లి' అనే సినిమా పేరు కూడా తన ఇన్‌స్టా ద్వారా ప్రకటించింది సమంత. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నట్టు సమాచారం. ఇదిలావుంటే.. అసలు ఈ సినిమాకు దర్శకుడెవరు? అనేది సమంత అభిమానుల్లో నెలకొన్న ప్రశ్న. ఓ యువ దర్శకుడు ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నాడట. ఈ కథ కూడా అతనిదే అని సమాచారం. త్వరలోనే ఆ దర్శకుడి పేరును సామ్ ప్రకటించనుంది. ఇందులోని తన పాత్ర గురించి ఆమె చెబుతూ 'నటిగా నన్ను మరోస్థాయిలో నిలబెట్టే సినిమా ఇది. ఇందులో కొత్త సమంతను చూస్తారు. ఇందులో నేనే హీరో. నటిగా నాకొక సవాల్ ఈ సినిమా. మిగతా వివరాలు త్వరలోనే ప్రకటిస్తా' అని సామ్ ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నది.

'శతమానంభవతి' కంటే పెద్దహిట్ అవుతుంది

శర్వానంద్ కథానాయకుడిగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మనమే'. కృతిశెట్టి కథానాయిక. శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. పీపుల్ మీడియా పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన చిత్రం జూన్ 7న విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని అగ్రహీరో రామ్‌చరణ్ చేతులమీదుగా మేకర్స్ విడుదల చేశారు. 'శతమానంభవతి'ని మించిన హిట్ 'మనమే' అవుతుందని శర్వానంద్ నమ్మకం వ్యక్తం చేశారు. థియేట్రికల్‌గా మోస్ట్ బ్యూటిఫుల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇదని, నేటి యువతరం తమ తల్లిదండ్రులకు చూపించాల్సిన సినిమా 'మనమే' అని దర్శకుడు చెప్పారు. నటిగా తన జీవితంలో గుర్తిండిపోయే పాత్ర చేశానని కృతి శెట్టి ఆనందం వెలిబుచ్చింది. ఇంకా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కృతిప్రసాద్, అసోసియేట్ ప్రొడ్యూసర్ ఏడిద రాజా, సహనిర్మాత వివేక్ కూచిభోట్ల కూడా మాట్లాడారు.

చురకత్తుల సవ్యసాచి

నిఖిల్ యుద్ధవీరుడిగా నటిస్తున్న చిత్రం 'స్వయంభూ'. సంయుక్త, నభా నటేష్ కథానాయికలు. భరత్ కృష్ణమాచారి దర్శకుడు. భువన్, శ్రీకర్ నిర్మాతలు. షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. తాజాగా బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాలకు ఛాయాగ్రహణం అందించిన కె.కె.సెంథిల్‌కుమార్ 'స్వయంభు'లో భాగమయ్యారు. ఈ సినిమా కోసం హైదరాబాద్‌లో భారీ సెట్లను నిర్మించారు.

ప్రస్తుతం షూటింగ్ అక్కడే జరుగుతున్నది. నిఖిల్ కెరీర్‌లో ఇది అత్యంత భారీ చిత్రమని మేకింగ్ వీడియో చెప్పకనే చెబుతున్నది. శనివారం నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఓ స్పెషల్ పోస్టర్‌ని విడుదల చేశారు. రెండు కత్తులతో శత్రువులను దునుమాడే సవ్యసాచిలా ఈ పోస్టర్‌లో నిఖిల్ కనిపిస్తున్నారు. నిఖిల్ 20వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంగీతం: రవి బస్రూర్, సమర్పణ: రాగూర్ మధు, నిర్మాణం: పిక్సెల్ స్టూడియోస్.

గం.. గం.. గణేశా ఆ లోటు తీర్చేసింది

'గం.. గం.. గణేశా' సినిమాకు వస్తున్న స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ మధ్య కాలంలో సరైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు రాలేదు. 'గం.. గం.. గణేశా' ఆ లోటు తీర్చేసింది. తెలుగు రాష్ట్రాలే కాక, కర్ణాటకలో కూడా రెస్పాన్స్ బావుంది.' అంటూ ఆనంద్ దేవరకొండ ఆనందం వెలిబుచ్చారు. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాలో ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక కథానాయికలు. ఉదయ్‌శెట్టి దర్శకత్వంలో కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన సక్సెస్‌మీట్‌లో ఆనంద్‌దేవరకొండ మాట్లాడారు. ఈ సినిమా స్క్రీన్‌ప్లేని అందరూ మెచ్చుకుంటున్నారని, థియేటర్లలో విజిల్స్, క్లాప్స్ వినిపిస్తున్నాయని, వెన్నెల కిశోర్ చేసిన ఆర్గాన్ డేవిడ్ పాత్రకు హిలేరియస్ రెస్పాన్స్ వస్తున్నదని దర్శకుడు చెప్పారు. ఇంకా నిర్మాతలతోపాటు చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

ప్రేమ ప్రయాణంలో..

చైతన్యరావు, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'హనీ మూన్ ఎక్స్‌ప్రెస్'. తనికెళ్ల భరణి, సుహాసిని ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. రాజశేఖరుని దర్శకుడు. కేకేఆర్, బాల రాజు నిర్మాతలు. ఈ సినిమాలోని టైటిల్ గీతాన్ని ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'వినూత్నమైన కథతో తెరకెక్కిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. ప్రేమలోని కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుంది. యువతకు కనెక్ట్ అయ్యే అన్ని అంశాలుంటాయి' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: శిష్టా వీఎమ్‌కే, సంగీతం: కల్యాణి మాలిక్, రచన-దర్శకత్వం: బాల రాజశేఖరుని.

యథార్థ ఘటనలతో 'సత్యభామ'

'కొందరు పోలీస్ అధికారుల జీవితంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఈ కథ రాసుకున్నా. సత్యభామ పేరు మన పురాణాల్లో చాలా పవర్‌ఫుల్. అందుకే అదే టైటిల్ పెట్టాం' అన్నారు దర్శకుడు సుమన్ చిక్కాల. ఆయన నిర్దేశకత్వంలో కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సత్యభామ'. శ్రీనివాస రావు తక్కళపల్లి, బాబీ తిక్క నిర్మాతలు. ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సుమన్ చిక్కాల చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఈ కథలో ఎమోషన్, యాక్షన్ రెండు అంశాలుంటాయి. ఓ పర్పస్‌ను దృష్టిలో పెట్టుకొని కథ రాసుకున్నా. కథ వినగానే కాజల్ వెంటనే ఒప్పుకున్నారు. యాక్షన్ పార్ట్ కోసం ఆమె చాలా కష్టపడింది. డూప్‌లేకుండా పోరాటఘట్టాల్లో పాల్గొంది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సరే మహిళలను ఆదుకునే పోలీస్ ఆఫీసర్‌గా కాజల్ పాత్రతో ప్రతీ ఒక్కరూ కనెక్ట్ అవుతారు. ఈ సినిమాలో మహిళలకు చక్కటి సందేశం ఉంటుంది. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయొచ్చు. అయితే హైదరాబాద్ నేటివిటీ ఉన్న సినిమా కాబట్టి తెలుగులో విడుదల చేయడం కరెక్ట్ అనుకున్నాం. ప్రస్తుతం కొన్ని కథలు రాస్తున్నా. నా తదుపరి సినిమా వివరాలను త్వరలో వెల్లడిస్తా' అన్నారు.